
# అన్నమాచార్య సంకీర్తనలు



భారతరత్న

**శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి**


గానం చేసినవి.



సంపాదకుడు

**కామిశెట్టి శ్రీనివాసులు**

నానాటి బదుకు - నాఁటకము। కానక కన్నది - కైవల్యము (అన్నమయ్య)



ఎంతమాత్రమున నెవ్వరు

# అన్నమాచార్య సంకీర్తనలు

భారతరత్న

**శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి**

గానం చేసినవి.

సంపాదకుడు

**కామిశెట్టి శ్రీనివాసులు**

సౌజన్యం

**శ్రీ యాదాళ్ల పిచయ్యశెట్టి చారిటీస్ అసోసియేషన్, కడప**

ప్రచురణ

**అన్నమాచార్య మిషన్, హైదరాబాద్**

## విన్నపము :



'అమ్మ' శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి నిర్యాణం నన్ను తాత్కాలికంగ కలచివేసినది. కాని 'అమ్మ' నాకు కర్తవ్యబోధన చేసింది. అమ్మ ఎక్కడ మరణించింది. అన్నమయ్య పాటల్లో జీవించే ఉన్నది. అన్నమయ్య పాటలు వినే వారందరికి స్పష్టంగ కనిపిస్తున్నది. అమరగాయనికి మరణమా. గొంతుతో కాదు, మనసుతో పాడమంటున్నది. వినయం పెంచుకొమ్మంటున్నది. భక్తి అనే నావలో, శరణాగతి అనే తెరచాపతో, జీవన సముద్రాన్ని దాటి, ఒడ్డున నిలిచిన వేంకటగమణుని సేవించి తరించమంటున్నది. అన్నమయ్య కల్పించిన మానససరోవరాన రాజహంసలుగ విహరించమంటున్నది. అమ్మ పాడిన మూడు పదుల అన్నమయ్య పాటలను పదిమందిలో పాడించి ప్రచారం చేయాలనే సంకల్పం కలిగింది. 25 ఏండ్ల క్రితం అమ్మపాట కోసం ఎంపిక చేసిన 30 పాటలను అందరికీ అందుబాటులో ఉండేటట్లుగ ఈ చిన్న పొత్తాన్ని సిద్ధం చేసినాను. హెచ్.ఎం.వి. వారు ఈ పాటల క్యాశెట్లను, సి.డి. లను విడుదల చేసినారు. వీని అమ్మకం ద్వారా వచ్చిన రాయల్టీని అమ్మ తిరుమల తిరుపతి దేవస్థానాలకే సమర్పించినారు.

అమ్మ పాడిన 30 కీర్తనలు మీ ముందున్నవి. మీరు పాడుకొని పదిమందితో పాడించండి. ఈ పని అప్పుడే శ్రీమతి అనసూయామూర్తి ప్రారంభించింది. జనవరి 9, ఆదివారం, త్యాగరాయ గానసభలో 'అన్నమయ్య సంకీర్తన నీరాజనం' మా మిషన్ పక్షాన నిర్వహింపబడింది. శ్రీ త్యాగరాయ గానసభ వారు మాతో శ్రుతి కలిపినారు. భక్తి సంగీత సమ్రాజ్ఞికి సర్వశ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు, ఎం.వి.యస్. ప్రసాద్, ఐ.ఎ.యస్. (రిటైర్డు), శ్రీమతి ఉమారామారావు గార్లు నివాళులర్పించినారు. శ్రీమతి అనసూయా మూర్తి నాతోపాటు (నా మాటలతో) సంకీర్తన కైంకర్యాన్ని నిర్వహించినారు. ఆ చిరంజీవి ఉత్తరోత్తరాభివృద్ధిని సాధించాలని 'కొండలయ్యను' ప్రార్థిస్తున్నాను. శ్రీ బాలాజీ గ్రాఫిక్స్, శ్రీమతి మాధవి గారు ఈ గ్రంథాన్ని నిర్దుష్టంగ తీర్చినారు. వారికి శ్రీనివాసుని అనంతమంగళాశాసనాలు.

ఈ పారమార్థికమైన గ్రంథప్రచురణకు యాదాళ్ళ పిచ్చయ్యశెట్టి చారిటీస్, కడప వారు ద్రవ్యసహాయం చేసినారు. వారికి మా సంస్థ పక్షాన కృతజ్ఞతలు. నన్ను ఈ పనికి ప్రోత్సహించి ముందుకు నడుపుతున్న 'అమ్మ'కు హార్దమైన సుమాంజలిని ఘటిస్తున్నాను.


భవదీయుడు
**కామిశెట్టి శ్రీనివాసులు**
అన్నమాచార్య మిషన్

# శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారు ఆలపించిన అన్నమాచార్యుల కృతులు


| కీర్తన | రాగం | స్వరకర్త | పేజీ |
|---|---|---|---|
| శ్రీమన్నారాయణ | బౌళి | పశుపతి, కదైనల్లూరు | 1 |
| మనుజుడై పుట్టి | ఆభోగి | పశుపతి | 2 |
| భావములోన | శుద్ధధన్యాసి | నేదునూరి | 3 |
| క్షీరాబ్ధి కన్యకకు | కురంజి | కదైనల్లూరు | 4 |
| డోలాయాం | ఖమాస్ | కదైనల్లూరు | 5 |
| చేరి యశోదకు | మోహన | నేదునూరి | 6 |
| దేవదేవం భజే | హిందోళం | పినాకపాణి | 7 |
| నానాటి బదుకు | రేవతి | నేదునూరి | 8 |
| వందే వాసుదేవం | శ్రీరాగం | శెమ్మన్‌గుడి | 9 |
| 'తార్ షడయుం -సింహేంద్రమధ్యమం - కడయనల్లూరు) (పేయాళ్వారు పాశురం) | | | |
| ఎంతమాత్రమున | రాగమాలిక | కడయనల్లూరు | 10 |
| తొల్లియును | నీలాంబరి | కడయనల్లూరు | 11 |
| భావయామి | యమన్ కల్యాణ్ | కడయనల్లూరు | 12 |
| నటనల భ్రమయకు | లలిత | కడయనల్లూరు | 13 |
| ఒకపరి కొకపరి | ఖరహరప్రియ | నేదునూరి | 14 |
| నమో నమో రఘుకుల | నాట | కదైనల్లూరు | 15 |
| కొలువుడీ భక్తి | కేదారగౌళ | కదైనల్లూరు | 16 |
| పరమపురుష | షణ్ముఖప్రియ | కదైనల్లూరు | 17 |
| దీనుడనేను | సావేరి | కదైనల్లూరు | 18 |
| జోఅచ్యుతానంద | కాపి | కదైనల్లూరు | 19-20 |
| మరలి మరలి | రాగమాలిక | కదైనల్లూరు | 21 |
| బ్రహ్మ కడిగిన | ముఖారి | రాళ్లపల్లి | 22 |
| ఆదిపురుష / సర్వోపాయముల | కల్యాణి | కదైనల్లూరు | 23 |
| కలదింతె | కానడ | కదైనల్లూరు | 24 |
| కంటి కంటి | రాగమాలిక | కదైనల్లూరు | 25 |
| ఇదియే సాధన | రీతిగౌళ | కదైనల్లూరు | 26 |
| కన్నులెదుటిదె | జోగ్ | కదైనల్లూరు | 27 |
| నమోనారాయణాయ / నీ నామమె | మధ్యమావతి | కదైనల్లూరు | 28 |
| రారా చిన్నన్న | జంఝూటి | కదైనల్లూరు | 29 |

# అన్నమాచార్య సంకీర్తన నీరాజనం (9.1.2005 ఆదివారం)

## శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మికి నివాళులు



'దీప ప్రజ్వలన' - పొత్తూరి వేంకటేశ్వరరావు




'నీరాజనం' అనసూయామూర్తి, కామిశెట్టి శ్రీనివాసులు




శ్రోతలు




జాలీ రమేష్, ఉమారామారావు, ఎం.వి.ఎస్. ప్రసాద్, పొత్తూరి వేంకటేశ్వరరావు

## 'అమ్మ'తో అన్నమయ్యతో...




సదాశివం, శెమ్మన్‌గుడి, కామిశెట్టి, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి



అన్నమయ్య జయంతి సందర్భంగా తిరుపతి 1979

నా జీవితంలో, సారస్వత జీవితంలో సారవంతంగ సాగినవి "అమ్మతో అన్నమయ్యతో" గడపిన రోజులు. తెలుగు పాఠాలు చెబుతూ అన్నమయ్య పాటల ప్రవచనాలతో కాలం గడిపే నాకు అన్నమాచార్య ప్రాజెక్టు గ్రంథాన్ని ఉపక్రమించమని భగవంతుడు శ్రీనివాసుని స్వప్నాదేశం. అది నా గురుదేవుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి అనుగ్రహం. శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారి ప్రణయాదేశం. అన్నమాచార్య ప్రాజెక్టు 1978 డిసెంబరులో ప్రారంభమైంది. దీనికి పూర్వరంగం 1961లోనే మొదలైంది మా గురువు రాళ్ళపల్లి వారు 'బ్రహ్మకడిగిన పాదం' పాడి నాకు, నా మిత్రుడు శేషాద్రికి విశదపరచినప్పుడే.

తిరుమల తిరుపతి దేవస్థానాల ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగ ఉన్న శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ ఐ.ఎ.ఎస్. గారు తన ఛేంబర్‌లోకి పిలిపించి శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మిగారితో అన్నమయ్య పాటలు పాడించాలనే నిర్ణయం తెలిపినారు. అన్నమయ్యను గురించి ఆంగ్లంలో కొంత విషయాన్ని సిద్ధం చేసుకున్నాను. ప్రసిద్ధమైన అన్నమయ్య పాటలను రెండింటిని అప్పటి ప్రాజెక్టు కళాకారులు చిరంజీవులు శోభారాజు బాలకృష్ణ ప్రసాద్‌లతో పాడించి రికార్డు చేసి పెట్టుకున్నాను. శ్రీ ప్రసాద్ గారు, అప్పటి దేవస్థానం ఛైర్మన్ శ్రీ రమేశన్‌గారు నన్ను తమతో చెన్నైకి తీసుకొని పోయినారు. అన్నమయ్య యల్.పి. రికార్డులు హెచ్.యం.వి. సంస్థ ద్వారా చేయించాలన్నది వాళ్ళ సంకల్పం. అప్పుడంతగా ప్రచారంలో లేని అన్నమయ్య పాటల్ని ప్రపంచ ప్రసిద్ధిపొందిన శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారితో పాడించడం కొంత చర్చనీయాంశమైంది. పెద్దవాళ్ళంతా చర్చలు జరిపిన తర్వాత నాకు, అన్నమాచార్య ప్రాజెక్టు



తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సంకీర్తన గానం **1979**



తిరుమల దేవాలయంలో

డైరెక్టరుగ ప్రవేశం ఏర్పడింది. శ్రీ ప్రసాద్‌గారు నన్ను అన్నమయ్య గురించి, పాటల గురించి తెలపమన్నారు. అప్పుడు తొలిసారిగ కళాప్రపంచమంతా ఆరాధించే శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారిని ప్రత్యక్షంగ దర్శించుకొనే అవకాశం కలిగింది. నా దృష్టి అమ్మ పాదాలను స్పృశించింది. నా మనసు పురివిప్పిన నెమలిలా అయింది. ఆ తల్లి ముఖంలో వర్చస్సు ఆనంద నిలయ కాంతులను తలపించినవి. కన్నతల్లి పలికింది 'ఉత్కారుంగళ్' (కూర్చోండి) ఆర్ద్రమైన ఆ పలకరింపు కార్యసానుకూలతను తెలిపింది. సదాశివంగారు (సుబ్బులక్ష్మి గారి భర్త) 'would you like to have sukku coffee' అన్నారు. ప్రక్కన యెవరో చెప్పారు అది 'శొంఠి కాఫీ' అని. అది హార్లిక్సులో కలిపి తయారుచేసింది. (అప్పటినుండి ఈనాటి వరకు రోజూ నేను 'సుక్కు' తాగుతూనే ఉన్నాను.) సదాశివంగారు కొంత ఆధికారికంగా ధ్వనించినారు. నేను అన్నమయ్యను గురించి క్లుప్తంగ తెలిపినాను. నా కంఠం బాగుందన్నారు. అమ్మ 'మీరు పాడుతారా' అని అడిగింది. నా అయోగ్యతను తెలిపినాను. 'నానాటి బదుకు నాటకము', నేను రికార్డు చేసిన పాటను వినిపించినాను. అమ్మ చాల ముగ్ధురాలైంది. 'I will sing this' అన్నది. అంతే అందరూ ఆనందంతో పొంగిపోయినారు. నేను అమ్మకు సదాశివంగారికి పాదాభివందనం చేసి నిష్క్రమించినాను. అన్నమయ్య సంకీర్తన మహోద్యమానికి రంగభూమి సిద్ధమయింది.

పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గారు ఆవేశంతో చెబుతున్నారు - "నీవు పూర్తిగా concentrate చేసి ఈ ఎం.ఎస్. సుబ్బులక్ష్మి ప్రాజెక్టు పూర్తిచేయి. నీవు కోరినట్లు అన్నమయ్య పాటలు విశ్వవ్యాప్తమౌతాయి. సదాశివంగారితో జాగ్రత్తగ మసలుకో". ప్రసాద్‌గారు నాతో ఎప్పుడు మాట్లాడినా చాలా ఆప్యాయంగ ఉంటుంది. నేను దేవస్థానం కాలేజీలలో పాఠాలు చెప్పే



ఇష్టాగోష్ఠి –
అమ్మ పాడిన పాటలు వింటూ



కామిశెట్టి శ్రీనివాసులు
కుటుంబసభ్యులతో
ఆత్మనాథన్, అమ్మ

మాష్టారుగ నా ఉద్యోగజీవితం 1964లో ప్రారంభమయింది. 1974 నుండి దేవస్థానం యాజమాన్యం అన్నమయ్య సంకీర్తన ప్రచార కార్యక్రమాల్లో నన్ను ఉపయోగించుకొన్నారు పూజ్యులు అన్నారావు; పి.ఎస్. రాజగోపాలరాజు, ఐ.ఎ.ఎస్. గార్లు. నేను సాగిస్తున్న ప్రచారకార్యక్రమాలను పసిగట్టి క్రాంతదర్శి అయిన శ్రీ ప్రసాద్‌గారు 1978లో అన్నమయ్య ప్రాజెక్టును ఏర్పాటుచేసి నన్ను సంస్థాపక సంచాలకులుగ నియమించినారు. శ్రీ ప్రసాద్‌గారు ప్రాజెక్టు కార్యకలాపాలలో నాకు పూర్తి స్వాతంత్ర్యాన్నిచ్చి ఆధికారికంగ, వ్యక్తిగతంగ ఎంతో ప్రోత్సాహాన్నిచ్చినారు.

'అన్నమయ్యబడి' ప్రారంభమయింది. తిరుపతి నుండి కారులో చెన్నైకు అన్నమయ్య గ్రంథాలరాశితో వెళ్లడం పరిపాటైంది. అప్పుడు సదాశివంగారు నుంగంబాకమ్‌లో వళ్లువార్ కొట్టం ఎదురుగ ఒక చిన్న యింట్లో కాపురముండేవారు. సదాశివంగారు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లినవారు. రాజాజీగారితో సన్నిహిత సంబంధం ఉన్నవారు. ఖద్దరు తప్ప మరేమి ధరించరు. పావుకోళ్లలాంటి చెప్పులు వేసుకొనేవారు. నాకు వాని మీద మోజు కలిగితే అవి తయారుచేసే షాపుకు వారి పి.ఏ. ఆత్మనాథన్ గారిని తోడిచ్చి పంపినారు. సదాశివంగారు కల్కిపత్రిక నిర్వహించేవారు. కొన్ని వ్యవహారాలలో చిక్కుకొని కోట్ల ఆస్తిని పోగొట్టుకొన్నారు. వాళ్లకు వచ్చిన కోట్లాది రూపాయలను ఎన్నో ధార్మిక కార్యక్రమాలకు విరాళంగా యచ్చినారు. పైకి చాలా కఠినంగ కనిపించే సదాశివంగారి మనస్తత్వం అత్యంత మృదువైనది. ఏ విషయమైన క్షుణ్ణంగా తెలుసుకోగల ధీశక్తి వారిది. నిర్ణయాలు చురుగ్గా తీసుకొని అంతే ఝటితితో ఆచరణలో పెట్టారు. అజానుబాహువైన సదాశివంగారు స్ఫురద్రూపులు. కళ్లతోనే ఎదుటివాని మనస్తత్వాన్ని చదవగల నేర్పువారిది.

ఒక్కొక్కమారు వారు తీసుకొనే నిర్ణయాలు కొంత యిబ్బందికరంగా ఉన్నా ప్రశాంతంగా ఆలోచిస్తే అవి అనుభవసత్యాలుగా గోచరిస్తాయి. వారి మనసెరిగి మెలిగే ప్రతిభాశాలి ఆత్మనాధన్‌గారు. వాళ్ల మధ్య ఉన్న బంధుత్వం, అనుబంధం ఏమిటో తెలియదుగాని సదాశివంగారు మాటిమాటికి ఒకమాట అనేవారు 'He is Atma - I am only a body'. ఇప్పుడు ఆ శరీరం లేదు. ఆత్మ మాత్రమే మిగిలినది. నామటుకు నాకు సదాశివంగారు బాగా అర్థమైనారు. వారితో నేను భేదించిన సన్నివేశాలు ఒకటి రెండు లేకపోలేదు. పాటల ఎంపికలో, రాగాల నిర్ణయంలో కొంత విభేదించినా చాలవరకు నా మాటకే విలువ యిచ్చేవారు. 'He is an authority on Annamacharya' అంటూ నన్ను శెమ్మన్‌గుడి మొదలైన పెద్దలకు పరిచయం చేసేవారు. క్యాశెట్టుకు, కాన్సర్టుకు ఉన్న తేడాను నాకు తెలిపిన సదాశివంగారు గురుతుల్యులు. వారికున్న 'time sense' అమోఘం. వారి internal, external discipline ఆదర్శవంతము. కచ్చేరిని రూపకల్పన చేసే వారి విధానం హుందాగా ఉంటుంది. నేను చాలా నేర్చుకున్నాను. 'చేరి యశోదకు' పాటకు ముందు అమ్మ మోహనరాగం ఆలపించింది. అక్కడున్న మేము, కడయనల్లూరు, టి.కె. మూర్తి, ద్వారం మంగతాయారు అందరం మంత్రముగ్ధులమైనాము. నేను ఆవేశంతో ఇది యిట్లనే రికార్డు చేయాలన్నాను. సదాశివంగారు వెంటనే నన్ను వారించి, Do you know the duration of L.P. What kunjamma has given in fifteen minutes she should give within two or three minutes. It is O.K. in the concert, not in the cassette. సదాశివంగారు మాతో చర్చల్లో పాల్గొనేవారు. మంచి మంచి suggestions యిచ్చేవారు. అవి సలహాలు కావు ఆదేశాలే. వారికున్న అనుభవం, అనుభవాల తీర్పు, ప్రతిపాదనా పటిమ, విశ్లేషణ, నన్ను ముగ్ధుని చేసినవి.



అన్నమాచార్య సంకీర్తనల క్యాశెట్టు ఆవిష్కరణ సభ
గౌ. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి,
సదాశివం, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి,
కామిశెట్టి శ్రీనివాసులు తదితరులు

'సదాశివం పేశరేన్' అని ఫోన్‌లో మాట్లాడే తీరు ఎంతో హుందాగా ఉంటుంది. అమ్మ, సదాశివంగారు నేను కలిసి ఎన్నోమార్లు భోంచేసే వాళ్లము. అయ్యర్ వండినా, అమ్మ తన స్వహస్తాలతో నెయ్యి వేస్తూ కూరలు వడ్డించేది. ఆ దంపతుల ప్రణయాన్ని, వాత్సల్యాన్ని పొందగలిగిన నాకు ఎంతో గర్వంగా ఉండేది. 'You are a member of our family' అని వారు నన్ను ప్రణయంతో సంభావించారు.



అన్నమయ్య పాటల మాష్టారుకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, సదాశివం దంపతుల సత్కారం

అమ్మ నోటుపుస్తకం, పెన్నుతో సిద్ధంగా ఉండేది. కడయనల్లూర్ వెంకట్రామన్ గారు తన్పురా, శ్రుతి బాక్స్ సిద్ధం చేసేవారు. కడయనల్లూర్ ఆలిండియా రేడియోలో తన్పురా విద్వాంసులుగ పనిచేసేవారు. అమ్మ అంటే యెనలేని భక్తి. అమ్మకు కూడ వెంకట్రామన్ గారంటే వాత్సల్యం. అమ్మ పాడే పాటలకు, స్తోత్రాలకు వీరే ఎక్కువగ సంగీతం కూర్చేవారు. నాకు సోదరతుల్యులు. నేను పాట చదివినప్పుడు తాళం గుర్తుపెట్టుకొనేవారు. ఒక్కొక్క పాటను నేను కనీసం వందమార్లైనా చదివేవాడిని. అమ్మ సాహిత్యాన్ని దేవనాగరిలిపిలో వ్రాసుకొనేది. ఉచ్చారణను గుర్తుపెట్టుకొనేది. బాగా మననం చేసేది. భావానికి కరిగిపోయే గొప్ప మనస్తత్వం ఆమెది. నేను ఇంగ్లీషులో అర్థాన్ని వివరించేవాన్ని. సదాశివంగారు ఆత్మనాథన్ గారు అరవంలో కూడా explain చేసేవారు. అమ్మకు కొంత తెలుగు అర్థమౌతుంది. How is your wife? అని, వెంటనే 'ఆమె బాగున్నారా' అని అడిగేది. తిరుపతికి వచ్చినప్పుడల్లా సదాశివంగారు తప్పనిసరిగా అమ్మతో కలసి మా యింటికి వచ్చేవారు. ఎంతో ఆప్యాయంగ చనవుగ తిరిగేవారు. అమ్మ నా భార్యతో చాలసేపు మాట్లాడేది. నా భార్యకు అరవం రాదు, ఇంగ్లీషు అంతంత మాత్రమే. అమ్మ ఎంతో ప్రేమగ మాట్లాడిందని నాకు చెప్పి మా ఆవిడ మురిసిపోయేది. నా యింట్లో ఒక 'ప్రేము




అమ్మతో కామిశెట్టి
కుటుంబసభ్యులు



అన్నమయ్య రజతపథకాన్ని
అందుకొన్న "అమ్మ"

ఉయ్యాల' ఉంటే సదాశివంగారు కూర్చుని ఊగుతూ పసిపిల్లవాడిలా కేరింతలు కొట్టేవారు. అమ్మతోపాటు రాధావిశ్వనాథం కూడ వచ్చేవారు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారి కుటుంబంతో నాకు సన్నిహిత సంబంధం ఏర్పడింది. వాళ్లంతా నాతో చనవుగ, ప్రేమగ మెలిగేవారు. మా ఇంటిల్లిపాదికి అమ్మ ఒక దేవతాస్వరూపం. ఆరాధనీయమూర్తి.

బాలాజీ పంచరత్నమాల అని ఐదు L.P.లకు నామకరణం చేయమన్నారు సదాశివం గారు. నేను శ్రీ వేంకటేశ్వర పంచరత్నమాల అనే పేరును సూచించాను. శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు వారి సహజశైలిలో 'శ్రీ వేంకటేశ్వర (బాలాజి) పంచరత్నమాల' అని పేరును ఖరారు చేసినారు. ఇందులో మూడు L.P.లు అన్నమాచార్యునివి, మిగిలిన రెండు భిన్నవిభిన్న సంస్కృత స్తోత్రాలు. వీనిని శ్రీ కంచి పరమాచార్యులు చంద్రశేఖర సరస్వతులు ఎంపిక చేసినారు. ఆ పరమాచార్యుల ఆశీస్సులతో పంచరత్నమాల నిర్విఘ్నంగ ముగిసింది. నాకు స్వప్నంలో ఆ పరమాచార్యుల చందనాంకిత పాదముద్రలు దర్శనమైనవి. తర్వాత 1991లో శ్రీ యం.వి.యస్. ప్రసాద్ గారు తి.తి.దేవస్థానాల ఎక్సిక్యూటివ్ ఆఫీసరుగ ఉన్నప్పుడు మరొక అన్నమాచార్యుల కీర్తనల ఆల్బమ్ సిద్ధమయింది. మొత్తం అన్నమయ్య సంకీర్తనలు నాలుగు క్యాసెట్లుగ, సి.డి.లగ రూపెత్తినవి. అమ్మ గానం చేసినవి 30 పాటలు. ఈ పాటలన్నీ అమ్మ విని, అర్థం చేసుకుని, ఉచ్చారణ తెలుసుకొని కంఠస్థం చేసి రాగభావతాళాల సౌహార్దంతో అనితరసాధ్యంగ ఆలపించి అన్నమయ్య సంకీర్తన గానానికి సంప్రదాయాన్ని నెలకొల్పింది. అన్నమయ్య పాటకు బాటవేసి ప్రామాణికతను సంతరించినది. అన్నమయ్య పాట విశ్వవ్యాప్తం కావడమే కాదు విశ్వమంతా అన్నమయ్య పాట వైపు చూసేటట్లు చేసింది. అన్నమయ్య సంకీర్తనకు ప్రాణప్రతిష్ఠ చేసిన ఆ భక్తిసంగీత సమ్రాజ్ఞికి కళాప్రపంచమంతా ఋణపడి ఉన్నది.



టి. సదాశివం కామిశెట్టి యింట్లో



అమ్మ, రాధా విశ్వనాథం,
శ్రీమతి కామిశెట్టి

తమిళం మాతృభాష అయినా అమ్మ సంస్కృత ఉచ్చారణ నిర్దుష్టంగా ఉండేది. ఆమెకు గొప్ప అదృష్టం, సదాశివంగారు భర్తగా లభించడం. ఆమె ఏ భాషలలో పాడితే ఆ భాషాపండితులతో చర్చ చేయడానికి, ఆ శబ్దాలను చక్కగ ఉచ్చరించడానికి అవకాశం ఉండేది. ఆమె వేంకటేశ్వర సుప్రభాతం, తర్వాతి సుప్రభాతాలకు ఒరవడి దిద్దింది. ఆమె మీరాభజనలు పాడితే ఔత్తరాహులు జేజేలు కొట్టారు; కన్నడ పదాలు ఆలపిస్తే కర్ణాటక పండితులు తలలూపారు. శ్రీ సదాశివంగారు ప్రతిది ప్రణాళికాబద్ధంగ చేస్తారు. ఏ పాట పాడాలో, కాదు ఏ చీరె కట్టుకోవాలో కూడ వారే నిర్ణయిస్తారు. సన్నివేశానికి, సందర్భానికి తగినట్లుగ వ్యవహారం నడిపేవారు. అమ్మకు పాట తప్ప మరే ఆలోచన లేదు. కచ్చేరికి వెళ్లినప్పుడు ఏయే సౌకర్యాలుండవలె, రికార్డింగులకు ఎట్లా వెళ్లాలి? అన్నీ వారే స్వయంగా పర్యవేక్షిస్తారు. ఏ కారులో ఎవరెవరు కూర్చోవలె, ఎక్కడ కూర్చోవలె మొదలైన విషయాలు కూడ వారే చూస్తారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేసేవారు. సదాశివంగారు తన పుట్టినరోజు జరుపుకొనే విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎవ్వరికీ తెలియకుండా కారు డిక్కీలో కొన్ని వందల అన్నం పొట్లాలు వేసుకొని పేదవారు నివసించే గుడిసెలలో పంచేవారు. ధారాళమైన వారి మనస్సు వారికి కొన్ని కష్టాలను కూడ తెచ్చినది. అమ్మ చెబుతూ ఉండేది "You have not seen our home in Kalki Gardens. Ofcourse we have lost." కానీ కష్టాలలో కూడ పదిమందికి సుఖాన్ని పంచిన దివ్యదంపతులు వారు. బాలాజీ పంచరత్నమాల నిర్మాణానికి దేవస్థానంవారు 8 లక్షలు డిపాజిట్ చేశారు. ఆ పైకం కూడ అమ్మ తదనంతరం దేవస్థానానికి చెందుతుంది. దీనిని కూడ విమర్శించినవారు లేకపోలేదు. కానీ ఎంతమందికి తెలుసు శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం రికార్డింగుల రాయల్టీని

ఎప్పుడో తిరుమల దేవస్థానానికి అర్పించిన విషయం. వానివల్ల దేవస్థానానికి కోటి రూపాయలపైన ఆదాయం చేకూరింది. 'శ్రీ వేంకటేశ్వర పంచరత్నమాల' నుండి వచ్చిన ఆదాయం మరొక కోటి రూపాయలను నేనే ప్రాజెక్టు పక్షాన దేవుని ఖజానాకు జమచేసినాను. వీనికి మించి శ్రీనివాస తత్త్వప్రచారానికి వారు చేసిన సేవకు, ఎన్ని కోట్లు విలువ కట్టగలము. ఇలాంటి విమర్శనలను చూసే, అన్నమయ్య వారిని 'కురచబుద్ధులు' అంటాడు.



అమ్మకు పాదపూజ చేస్తున్న
శ్రీమతి కామిశెట్టి

నేను ఎంపికచేసిన ముప్పై పాటలు అమ్మ, సదాశివంగారు స్వయంగా విని అంగీకరించినవే. తెలుగుపాటలు నేర్పించేటప్పుడు ఒక్కొక్కరోజు గంటల తరబడి కూర్చొనేది. అంత పెద్ద విద్వాంసురాలు అంత వినయంగా ఒదిగి కూర్చొని వ్రాసుకుంటూ మననం చేసుకోవడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించేది. అమ్మ నన్ను చూపుతూ 'He is my Teacher' అన్నప్పుడు నా బాధ్యత గుర్తుకు వచ్చేది. ఆ మధురదంపతులు నాకు శాలువ కప్పి సత్కరించిన సన్నివేశం మరువరానిది. మద్రాసు మ్యూజిక్ అకాడెమీవారు నాకు 'Best Demonstration Award' యిచ్చినారని తెలిసి ఆ దంపతులు నన్ను ప్రత్యేకంగా సత్కరించిన వైనం ఎట్లా వర్ణించగలను.

'దీనుడ నేను దేవుడవు నీవు' పాట పాఠం చెబుతున్నాను. చివరి చరణంలో "విడువలేని శ్రీవేంకటవిభుడవు కడదాకా నను కాతువుగాక" అనే వాక్యాన్ని వివరిస్తున్నాను. అమ్మ వింటూ కన్నీళ్లు కారుస్తున్నది. హఠాత్తుగా లేచి వెళ్లిపోయింది. నాకు అర్థం కాలేదు. నా వివరణలో ఏమన్నా దోషాలు దొర్లినవా అని సందేహిస్తున్న నన్ను చూసి సదాశివంగారు 'You want to know what Kunjamma is doing. Go and see inside the room' అన్నారు. నేను బెరుకుబెరుకుగానే వెళ్లాను. అమ్మ వెక్కివెక్కి ఏడుస్తున్నది. అమ్మ నా

చేతులు పట్టుకొని 'you are like my son' అంటూ 'వేంకటేశ్వరుడే నాకు సర్వస్వం' అని బావురుమన్నది. భావానికి భాష్యం శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి. భగవంతునికి సర్వాత్మనా అర్పణం చేసుకున్న భక్తురాలు అమ్మ. 'జో అచ్యుతానంద' పాడుతూ 'నాకు తిరువేంగడముడయాన్ పసిబాలునిలా కనిపించాడని తన్మయత్వం పొందేది. 'రారా చిన్నన్న' అని పాడుతున్నప్పుడు ఆమె కళ్లు ధారాపాతంగా వర్షించేవి. 'ఒకపరికొకపరి' పాటలో భావాన్ని వినిపించేటప్పుడు శ్రీనివాసుని శుక్రవారపు అభిషేకపు సొగసులను తలచుకొని మురిసిపోయేది. ఇట్లా ప్రతిపాటలో భావాన్ని మనసార అనుభవించి మర్మచక్షువులతో దర్శించుకొని గానం చేసిన మహాతపస్సంపన్నురాలు అమ్మ. అన్నమయ్య పాటలు కచ్చేరీలలో పాడినప్పుడెల్లా నాకు వర్తమానం వచ్చేది. సదాశివంగారు నన్ను రావాలని కట్టడి చేసేవారు. అమ్మ కూడ నేను ఉన్నానంటే ఎంతో తృప్తిపొందేది. తిరుమలలో, తిరుపతిలో, చెన్నై, బెంగుళూరు నగరాలలో అమ్మ వెన్నంటి ఉండేవాడిని.


తల్లీబిడ్డల అనుబంధం

భగవాన్ సత్యసాయిబాబా గారంటే అమ్మకు ఎనలేని భక్తి. వారు సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మే అనేది. కాని నేను ఆ రోజుల్లో వారంటే కొంత నిరాసక్తిని ప్రదర్శించేవాడిని. స్వామి గురించి మా మధ్య కొంత వాదం కూడ సాగేది. అమ్మ అన్నది 'You will see that one day Baba will drag you to Puttaparti'. అమ్మా అదొక్కటి నాకిష్టం లేదనేవాడిని. నాకు అంతటా వేంకటాచలపతే అని నా భావాన్ని తెలిపేవాడిని. ఇంతలో అనుకున్నంతా జరిగింది. అమ్మ పాడిన మొదటి L.P. రికార్డు చెన్నై, పుట్టపర్తి నగరాలలో ఆవిష్కరించాలని అధికారుల నిర్ణయం. శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు ఆ కార్యక్రమాలు నన్ను చూసుకొమ్మని 'ఆర్డర్' వేశారు. అమ్మ అన్నది 'You see. Did I not tell you. You are coming to

Puttaparti. అధికారికంగా నేను తప్పించుకొనేది ఏముంది. అమ్మతోపాటే పుట్టపర్తికి బయలుదేరినాను. భగవాన్ సత్యసాయిబాబా దర్శనమయింది. సదాశివంగారు నన్ను పరిచయం చేశారు. బాబా 'తెరియుమే' అన్నారు. అప్పటికింకా నాకు జ్ఞానోదయం కాలేదు. అయిష్టంగానే అందరితోపాటు వారికి పాదాభివందనం చేసినాను. మరుసటిరోజు సాయంకాలం కార్యక్రమం. ఉదయం ఒంటరిగ ప్రశాంతినిలయమంతా తిరిగినాను. అంతటా నిశ్శబ్దం. భక్తులు ఎవరిపాటికి వాళ్లు తిరుగుతున్నారు. 'ద్వేషించడానికి ఏమీ లేదు' అన్నది నాకు కలిగిన ఆలోచన. మళ్లీ బాబాగారి దర్శనానికి వెళ్లాము. అమ్మ, సదాశివంగారు, పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గారు అందరూ ఉన్నారు. బాబా మాకు ఏకాంతగోష్ఠికి అవకాశం కలిగించినారు. చిన్నగదిలో ఒక సింహాసనం మీద స్వామి కూర్చున్నారు. నాకు చోటు లేక నిల్చున్నాను. 'ఇక్కడికి రా బంగారు' అని స్వామి తన ప్రక్కనే క్రింద చోటు కల్పించినారు. అమ్మనుద్దేశించి 'పంచరత్నమాల చేస్తున్నావు, నీకు నవరత్నమాల' అని బాబా దానిని గాలిలోనే సృజించినారు. సదాశివంగారితో అమ్మకు అలంకరింపజేసినారు. 'వేదాంత చర్చ చేయండి, గోష్ఠి చేయండి' అంటున్నారు బాబా. పెద్దవాళ్లంతా మిన్నకున్నారు. నాకు మాట్లాడాలని ఉంది. కాని అధికప్రసంగమౌతుందేమోనని ఊరకున్నాను. బాబా 'మాట్లాడు బంగారు' అన్నారు. అమ్మ నావైపు ప్రోత్సాహకరంగా చూసింది. ప్రసాద్‌గారు సైగ చేసినారు. స్వామితో తొలిసారిగా ముచ్చటించాను.

(అన్నమయ్య పాటలో సందేహం వ్యక్తం చేసినాను.)

నేను : స్వామీ! 'దిబ్బలు వెట్టుచు తేలినదిదివో' అనే పాటలో 'పాలు నీరు వేర్పరచి పాలలో ఓలలాడెనిదె ఒక హంస' అంటారు. పాలు పుణ్యము, నీరు పాపము. భగవంతుని సృష్టిలో పుణ్యపాపాలున్నవి కాని దేవునికి పుణ్యమే యిష్టం. 'పుణ్యపాపే విధూయ' అని ఉపనిషద్వాక్యం. (ఈ వ్యాఖ్యానాన్ని విన్న స్వామి నవ్వి అన్నారు.)

బాబా : నేనట్లా అనుకోను బంగారు. అక్కడ నిత్యం పాలు, అనిత్యం నీరు. భగవంతుడు నిత్యంలోనే సంచరిస్తాడు.

ఎంతమంచి వ్యాఖ్యానం. నా సందేహాలు పటాపంచలైనవి.

అమ్మనడిగారు బాబా 'నీ వయస్సు ఎంత?'. అమ్మ '63' అని చెప్పింది. 'కాదు 36 కదా' అన్నారు. బాబా అందరినీ ఆశీర్వదించారు. సాయంకాలం L.P. రికార్డు ఆవిష్కరణ. పంచరత్నమాలలో తొలి రికార్డు. బాబా అందరికీ లడ్డూలు పంచినారు స్వహస్తాలతో. ఆ రోజు అమ్మ పుట్టినరోజు కూడ. అమ్మపాటకు కూర్చున్నది. బాబా సింహాసనం క్రింద కూర్చున్నారు. నన్నుచూసి 'రా బంగారు, మాట్లాడు' అన్నారు. అన్నమయ్య గురించి, ప్రాజెక్టు గురించి 5 నిముషాలు మాట్లాడాను. 'ఇంకా మాట్లాడు' అన్నారు. మరో ఐదు నిముషాలు అమ్మ పాడే పాటల సారాంశము వివరించాను. బాబా నా వీపు నిమిరి ఆశీర్వదించినారు. అమ్మ 'ఎంత మాత్రమున' పాట పాడుతూ ఉంటే బాబా తన్మయత్వంతో నాట్యం చేస్తూ గాలిలోకి చేతులు ఊపుతూ నిష్క్రమించినారు.



అమ్మ నా కళ్లకు కప్పిన అజ్ఞానాన్ని తొలగించింది.

బాబా తమ పరిపూర్ణమైన అనుగ్రహాన్ని ప్రసాదించినారు. అప్రతర్కికంగా నా మదిలో ఒక గీతం మెదలింది.

"ఏమని పొగడుదు శ్రీసాయీ
ఆమని సొగసుల సత్యసాయి
ఎంత మధురమా చిరుదరహాసము
ఎంత లలితమా సుందరవదనము

కమ్ముకున్న అజ్ఞానపు తెరలు తొలగెను నేడు
నమ్ముకున్న ఈ దీనుని వీడకు మేనాడు
అడుగడుగున అలముకొన్న ప్రశాంతినిలయము నీవు
అణువణువున తొంగిచూచు అశాంతిని బాపుము స్వామీ"

ఆర్జవత్వంతో వెలువడిన ఆ గీతాన్ని శ్రీ బాబా దివ్యచరణాలకే సమర్పించినాను. అమ్మ ఎంతో సంతోషించింది. బాబా దివ్యస్వరూపాన్ని నా మనసు కెక్కించిన అమ్మకు నేను సదా కృతజ్ఞుడను. తర్వాత సదాశివంగారు, నేను, బాబాగారిని ఏకాంతంగా కలుసుకున్నాం. బాబా నాకు ప్రత్యేకంగా ఏకాంతాన్ని అనుగ్రహించారు. బాబాకు నాకు మధ్య సాగిన సంభాషణ దేవరహస్యం. బాబా సందేశం మాత్రం నాకు బోధపడింది. "నీవు గొప్ప ఉద్యమాన్ని చేపట్టినావు బంగారు. నేను నీ ముందుండి నడుపుతాను." అంటూ నా కన్నీళ్లను తుడిచినారు. బాబా చూపులలో నా కన్నతల్లి మెదలింది.

"నేను భగవంతుడనని చాటడంలో తప్పేముంది. మన అందరిలో భగవంతుడున్నాడు. ఆ భగవంతుని మనం ప్రేమతోనే సాధించేది. ప్రేమ, ప్రేమ. ఈ అనంతసృష్టిని నడిపేది, కాపాడేది ప్రేమ." బాబా మాటలు అక్షరాల సత్యం. "ద్వేషించడానికి ఏమీ లేదు. ప్రేమించడానికి చాలా ఉంది". నాకిది మంత్రోపదేశం.

బాలాజీ పంచరత్నమాల ఐదు L.P. రికార్డులు విడుదలైనవి. అన్నమయ్య పాటలు అందరు వినడానికి అవకాశం ఏర్పడింది. ఆ రోజుల్లో లాంగ్ ప్లే రికార్డులే. తర్వాత క్యాసెట్లు, సి.డి.లు, ఎం.పి.3లు విరివిగ వచ్చినవి. అన్నమయ్య పాటలు రికార్డు చేయడమేకాదు అమ్మ, కూతురు రాధా విశ్వనాధంతో కలసి వందల కచ్చేరీలు చేసింది. అమ్మ రికార్డులతోపాటు, ప్రత్యక్షంగ పాడడం, సంగీతవిద్వాంసులలో ఆసక్తిని పెంచినది. అన్నమయ్య పాటలు కచ్చేరీలకు యోగ్యమని కళారసికులు గుర్తించినారు. పెద్దపెద్ద కర్ణాటక విద్వాంసులందరు దక్షిణాపథంలో అన్నమయ్య పాటలను గానం చేయసాగినారు. వాద్యాలలో కూడ అన్నమయ్య పాటలు వినిపించడం మొదలయింది. నాట్యాచార్యులు అన్నమయ్య పదాలను అభినయానికి స్వీకరించారు. సంగీత-సాహిత్య-నాట్యకోవిదులు అన్నమాచార్య సంకీర్తనలపై విశేష ఆదరణ చూపడానికి ప్రధాన కారణం తి.తి.దేవస్థానాల అన్నమాచార్య ప్రాజెక్టు కృషి అందులో 'అన్నమయ్య సంకీర్తన గానం' 'అమ్మ' మన జాతికి యిచ్చిన గొప్ప వరం. మదరాసు దూరదర్శన్ వారు (శ్రీమతి అఖిలాశివరామన్‌గారు) అన్నమయ్య సంకీర్తనల తొలి వీడియో రికార్డింగ్ అమ్మతో చేయించి ప్రసారం చేసినారు. నాకు కూడ ఆ కార్యక్రమానికి ముందు నాలుగు మాటలు పలకడానికి అవకాశం కలిగింది (1979లో).

అన్నమయ్య సంకీర్తనల రికార్డింగులో నాకు పరిపూర్ణ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కైసేసిన అప్పటి తి.తి.దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు సర్వశ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ ఐ.ఎ.ఎస్., ఎం.వి.ఎస్. ప్రసాద్ ఐ.ఎ.ఎస్. గార్లు; గ్రామఫోన్ రికార్డింగ్ కంపెనీ (HMV) పక్షాన సర్వశ్రీ మత్రై, మంగపతి, రికార్డింగ్ ఇంజనీరు రఘుగార్లు, నేను కేవలం అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టరుగ, ఉద్యోగవ్యాజంతో నిర్వహించిన పనికాదిది. ఉద్యమస్ఫూర్తితో భగవదర్పణబుద్ధితో దీనినొక పవిత్రకార్యంగ భావించి సాగించినదే. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి సదాశివంగార్లు నన్ను పుత్రవాత్సల్యంతో మన్నించినారు. నేను అన్నమయ్య గురించి, పాటల గురించి చేసిన ప్రతిపాదనలను ప్రణయగౌరవాలతో స్వీకరించినారు. ఈ పాటల రికార్డింగుల మధ్య ఎందరో ప్రవేశించాలని ప్రయత్నించినారు. సదాశివం గారు వారిని మర్యాదగ తిరస్కరించి "శ్రీనివాసులు అన్నీ చూసుకుంటారు" అన్న విశ్వాసాన్ని చివరివరకు నిలుపుకున్నారు. ఆధికారికమైన విషయాలేవి మా మధ్య సాగేవి కావు. ఆత్మనాథన్‌గారు భ్రాతృభావంతో నాతో వ్యవహరించేవారు. "Atma will take care of the things. you be in touch with him" అన్నదే సదాశివంగారి అభిప్రాయం. అమ్మను ఎప్పుడు కలిసినా నేనిచ్చిన అలమేలుమంగ కుంకుమ ప్రసాదాలు భక్తితో స్వీకరించేది. దేవతారాధనలో ఉంచేది. సదాశివం గారిని 'అప్ప' అని పిలిచేవాడిని. వారికి శ్రీవారి 'మహాప్రసాదం' చాల యిష్టం. పచ్చకప్పురము, చందనమున్న పాకెట్లను వారికి యెప్పుడూ అందజేసేవాడిని. వానిని పదిమంది భక్తులకు పంచి తృప్తిపడేవారు.


అమ్మ దేవతారాధనను స్వయంగా నిర్వహించేది. ఆమె ఆరతిపట్టే విధానం ఎంతో సమ్మోహనకరంగా ఉండేది. సంప్రదాయకళ ఉట్టిపడేది. నేను ఈ ప్రాజెక్టు నిర్విఘ్నంగ పరిసమాప్తం కావాలని దీక్షలో ఉన్నప్పుడు, నా ఆరోగ్యం గురించి పదేపదే విచారించేది. "అయ్యప్పస్వామి దీక్ష పూనిన నాకు భిక్షపెట్టి పాదాభివందనం చేసినప్పుడు, నేను ప్రతిగ అమ్మ పాదాల నంటి ఆశీర్వాదం తీసుకున్నాను. అమ్మ నావైపు ప్రశ్నార్థకంగా చూసినప్పుడు 'మీది మాతృస్థానం' అన్నాను. ఆమె చివరి నిశ్వాసం వరకు నన్ను పుత్రవాత్సల్యంతో మన్నించింది. గతించిన నా తల్లిని ఈ 'తల్లిలో' చూసుకొని తృప్తిపడేవాడిని. నాకిప్పుడు 'అమ్మ' పోయిందని విచారం లేదు. ఆమె పాడే ప్రతి అన్నమయ్య పాటలో సజీవంగా సాక్షాత్కరిస్తుంది. 'Is it O.K'. తప్పులు లేవు కదా అని 'బెరుకుచూపులతో' కనిపిస్తుంది.

సంగీత ప్రపంచానికే ఆచార్యత్వాన్ని పొందిన ఆ మహావిద్వాంసురాలు నాకు 'ఒక విద్యార్థిని' అన్న భావం నా యోగ్యతకు కాదు కేవలం నా బాధ్యతకు సంబంధించినదే. వర్చస్వంతమైన రూపం. ఏరులై ప్రవహించే వాత్సల్యం. కోటివీణలను పలుకరించే కంఠస్వరం. నిగ్రహీతమైన ఆవేశం. భావబంధురమైన వాక్శుద్ధి, అరమోడ్పు కనులలో పారవశ్యం, సర్వాత్మనా అర్పణబుద్ధి "కుంజమ్మ"కు నైసర్గిక సంపదలు. 'కానిమ్మని' ఆ గాన సరస్వతిని భువికి పంపిన విధాత 'రారమ్మ'ని తన దివికి చేర్చుకున్నాడు.

"జుట్టెడు కడుపుకై చొరని చోట్లు చొచ్చి" అన్నీ దంత్యాలే. తాలవ్యాలే కాని దంత్యాలు లేని భాష మాటాడే ఆ తల్లి గాయకులకు దంత్యోచ్చారణ ఏమిటో నేర్పింది. ఆమెకు శబ్దము తెలుసు, అర్థం తెలుసు; వీటన్నిటిని మించి 'పరమార్థం' తెలిసిన "పరమగానయోగి" శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి. నాథుని కనుసన్నలలో మెలగి నాదసాధనే జీవిత తపముగ చేసుకొని జగన్నాథునిలో లీనమైన అమ్మకు పునర్జన్మ లేదు.

**"పుట్టుటయు నిజము – పోవుటయు నిజము**
**నట్టనడిమి పని నాటకము"**

తిరుమల శిఖరాలలో ప్రతిధ్వనిస్తున్నది. అన్నమయ్య పాటను అమ్మ అందుకొన్నది. అమ్మ పాట విశాలవిశ్వం అందుకొన్నది.



పల్లవి :

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ - శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు

చరణాలు :

కమలాసతీ ముఖకమల కమలహిత - కమలప్రియ కమలేక్షణా
కమలాసనహిత గరుడగమన - శ్రీ కమలనాభ నీపదకమలమే శరణు

పరమయోగిజనభాగధేయ - శ్రీ పరమపూరుషా పరాత్పరా
పరమాత్మ పరమాణురూప- శ్రీ తిరువేంకటగిరిదేవ శరణు



శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే
శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే

పల్లవి :

మనుజుడై పుట్టి మనుజుని సేవించి - అనుదినమును దుఃఖమందనేలా

చరణాలు :

జుట్టెడుకడుపుకై చొరనిచోట్లు చొచ్చి - పట్టెడుకూటికై బతిమాలి
పుట్టినచోటికే పొరలి మనసుపెట్టి - వట్టిలంపటము వదలనేరడుగాన

అందరిలో పుట్టి అందరిలో చేరి - అందరిరూపము లటు తానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి - అందరాని పదమందె నటుగాన



నరులను కొలిచి నగుబాట్లు పాలగుట కంటె
శ్రీహరిని సేవించి పరమపదమందుట మేలు

పల్లవి :

భావములోన, బాహ్యమునందును గోవింద గోవింద యని కొలువవో మనసా

చరణాలు :

హరియవతారములే అఖిల దేవతలు - హరిలోనివే బ్రహ్మాండంబులు
హరినామములే అన్ని మంత్రములు - హరిహరి హరిహరి యనవో మనసా

విష్ణుని మహిమలే విహితకర్మములు - విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు - విష్ణువు విష్ణువని వెదకవో మనసా

అచ్యుతుడితడే ఆదియు నంత్యము - అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీద నిదె - అచ్యుత అచ్యుత శరణనవో మనసా



అంతరంగ బహిరంగాలలో నిలిచిన
వేంకటపతి కరుణాంతరంగుడు

పల్లవి :

క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికిని - నీరజాలయకును నీరాజనం.

చరణాలు :

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు - నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు - నిలువు మాణిక్యముల నీరాజనం

(చరణ కిసలయములకు సకియ రంభోరులకు - నిరతమగు ముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు అతివ నిజనాభికిని - నిరతి నానావర్ణ నీరాజనం)

పగటు శ్రీ వేంకటేశు పట్టపురాణియై - నెగడు సతికళలకును నీరాజనం
జగతి అలమేలుమంగ చక్కదనముల కెల్ల - నిగుడు నిజశోభనపు నీరాజనం



పాలకడలి వెడలి వచ్చిన మహాలక్ష్మికి,
శ్రీనివాసుని పట్టపురాణికి నీరాజనం

పల్లవి :

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం

చరణాలు :

మీనకూర్మ వరాహ మృగపతిఅవతారా
దానవారే గుణశౌరే ధరణీధర మరుజనక

వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ

దారుణ బుద్ధ కలికి దశవిధఅవతారా
శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరికూటనిలయ



**ఉయ్యాలలూగుతున్నాడు వేంకటగిరిపతి**
**అవని భారము దింపగ అవతారమూరితి**

పల్లవి :

చేరి యశోదకు శిశువితడు - ధారుణి బ్రహ్మకు తండ్రియు నితఁడు

చరణాలు :

సొలసి చూచినను సూర్యచంద్రులను - లలి వెదచల్లెడు లక్షణుడు
నిలిచిన నిలువున నిఖిల దేవతల - కలిగించు సురల గనివో యితడు

మాటలాడినను మరి యజాండములు - కోటులు వొడమెటి గుణరాశి
నీటగు నూర్పుల నిఖిల వేదములు - చాటువ నూరెటి సముద్రమితడు

ముంగిట పొలసిన మోహన మాత్మల - పొంగించే ఘనపురుషుడు
సంగతి మావంటి శరణాగతులకు - అంగము శ్రీవేంకటాధిపుడితడు



**బ్రహ్మదేవునికన్న తండ్రి**
**యశోదమ్మ కన్నబిడ్డ అయినాడు.**
**ప్రణయవాత్సల్యమూర్తి పరమాత్ముడు.**

పల్లవి :

దేవదేవం భజే దివ్యప్రభావం - రావణాసురవైరి రణపుంగవం

చరణాలు :

రాజవరశేఖరం రవికులసుధాకరం - ఆజానుబాహునీలాభ్రకాయం
రాజారికోదండరాజదీక్షాగురుం - రాజీవలోచనం రామచంద్రం

(నీలజీమూతసన్నిభశరీరం ఘనవి - శాలవక్షం విమలజలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపనం - భూలలనాధిపం భోగిశయనం)

పంకజాసనవినుత పరమనారాయణం - శంకరార్జితజనకచాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం - వేంకటేశం సాధువిబుధవినుతం



**శృంగారవీరరసమూర్తి శ్రీ కోదండరాముడు**
**సాధుజనసంరక్షకుడు రవికులసుధాకరుడు**

పల్లవి :

నానాటి బదుకు నాటకము - కానక కన్నది కైవల్యము

చరణాలు :

పుట్టుటయు నిజము పోవుటయు నిజము - నట్టనడిమి పని నాటకము
యెట్ట నెదుటగలదీప్రపంచము - కట్టకడపటిది కైవల్యము

(కుడిచే దన్నము కోకచుట్టెడిది - నడుమంత్రపు పని నాటకము
వొడిగట్టుకొనిన వుభయకర్మములు - గడి దాటినపుడె కైవల్యము)

తెగదు పాపము తీరదు పుణ్యము - నగీనగీ కాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరు డేలిక - గగనము మీదిది కైవల్యము



జననమరణాల మధ్య సాగేదంతా నాటకము,
వేంకటేశుడు జగన్నాటక సూత్రధారి

పల్లవి :

వందే వాసుదేవం శ్రీపతిం - బృందారకాధీశవందితపదాబ్జం

చరణాలు :

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ - చందనాంకితలసచ్చారుదేహం
మందారమాలికామకుటసంశోభితం - కందర్పజనక మరవిందనాభం

(ధగధగితకౌస్తుభా దరణ వక్షస్థలం - ఖగరాజవాహనం కమలనయనం
నిగమాధిసేవితం నిజరూపశేషప - న్నగరాజశాయినం ఘననివాసం)

కరిపురనాథసంరక్షణే తత్పరం - కరిరాజవరదసంగతకరాబ్జం
సరసీరుహాననం చక్రవిభ్రాజితం - తిరువేంకటాచలా దేవం భజేఽహం



సకల జీవరాశులలో వాసుదేవుడున్నాడు
వాసుదేవునిలో సకల జీవరాశులు
వాసం చేస్తున్నాయి.



పిండికొద్దీ రొట్టె, మనసుకొద్దీ దేవుడు,
ఎట్లా భావిస్తే అట్లా కనిపిస్తాడు
వేంకటేశ్వరుడు

తాழ் శడైయుమ్‌నీళ్ ముడియుమ్ ఒణ్ మழువుమ్‌శక్కరముమ్। శూழరవుమ్ పొన్నాణుమ్ తోన్ఱుమాల్, శూழుమ్
తిరణ్డరుని పాయుమ్ తిరుమలై మే లెన్దైక్కు। ఇరణ్డురవు మొన్ఱాయ్ ఇశైన్దు (పేయాళ్వారు)

**పల్లవి :**

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి అన్నట్లు

**చరణాలు :**

కొలుతురు మిము వైష్ణవులు - కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు - పరబ్రహ్మం బనుచు
తలతురు మిము శైవులు - తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు - ఆదిభైరవు డనుచు

సరి నెన్నుదురు శాక్తేయులు - శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను - తలపుల కొలదులు భజింతురు
సిరుల మిమునే అల్పబుద్ధి తలచినవారికి అల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలచిన - ఘనబుద్ధులకు ఘనుడవు

నీవలన కొరతే లేదు మరి - నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల - ఆజలమే వూరిన యట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము - చేకొని వున్న దైవమని
యీవలనే నీ శరణనియెదను - యిదియే పరతత్త్వము నాకు



కావేరీనదీమతల్లి తన తరంగహస్తాలతో
శ్రీరంగశిశువును ఉయ్యాలలూపుతున్నది.

పల్లవి :

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూగెగన - చెల్లుబడి నూగీని శ్రీరంగశిశువు

చరణాలు :

కలికి కావేరి తరగల బాహులతలనే - తలగకిటు రంగమధ్యపు తొట్టెలను
పలుమారు తనునూచి పాడగానూగీని - చిలుపాలసెలవితో శ్రీరంగశిశువు

(అదివో కమలజుని తిరువారాధనంబనగ - అదన కమలభవాండమనుతొట్టెలను
ఉదధులు తరంగములనూచగా నూగీని - చెదరని సిరులతోడ శ్రీరంగశిశువు)

వేదములె చేరులై వెలయంగ శేషుడే - పాదుకొను తొట్టెలై పరగగాను
శ్రీదేవితోకూడి శ్రీవేంకటేశుడై సేదదేరెడి వాడె శ్రీరంగశిశువు

పల్లవి :

భావయామి గోపాలబాలం మనస్సేవితం తత్పదం చింతయేయం సదా

చరణాలు :

కటిఘటిత మేఖలా ఖచిత మణిఘంటికా - పటల నినదేన విభ్రాజమానం
కుటిలపదఘటిత సంకులశింజితే నతం - చటులనటనా సముజ్జ్వలవిలాసం

నిరత కరకలిత నవనీతం బ్రహ్మాది - సురనికర భావనాశోభితపదం
తిరువేంకటాచలస్థిత మనుపమం హరిం - పరమపురుషం గోపాలబాలం



చేతవెన్నముద్ద,
నడుమున మణుల ఒడ్డాణం,
బాలకృష్ణుని పదలయగతులు
జగమంతా నిండినవి.

పల్లవి :

నటనల భ్రమయకు నామనసా - ఘటియించు హరియె కలవాడు

చరణాలు :

ముంచిన జగమిది మోహినీగజము - పొంచినయాస పుట్టించేదిది
వంచనల నిజమువలెనే వుండును - మంచులు మాయలె మరునాడు

సరిసంసారము సంతలకూటమి - సొరిదిపచారము చూపేదిది
గరిమనెప్పుడు కలకలమనుచుండును - మరులగువిధమే మాపటికి

కందువదేహము గాని ముదియదిది - అందిన బహురూపమాడేదిది
యెందును శ్రీవెంకటేశ్వరుడుండును - డిందుపడగనిదె తెరమరగు



మనసు చంచలమైనది.
అచంచలమైన వేంకటేశ్వరునిపై భక్తి
శాంతిసౌఖ్యాలను ప్రసాదిస్తుంది.

పల్లవి :

ఒకపరి కొకపరి కొయ్యారమై - మొకమున కళలెల్లా మొలచినట్లుండె

చరణాలు :

జగదేకపతి మేన చల్లిన కర్పూరధూళి - జిగిగొని నలువంక చిందగాను
మొగి చంద్రముఖి నురమున నిలిపె గన - పొగరు వెన్నెల దిగబోసినట్లుండె

(పొరి మెరుగు చెక్కుల పూసిన తట్టుపుణుగు - కరిగి యిరుదెసల కారగాను
కరిగమన విభుడు గనక మోహమదము - తొరిగి సామజసిరి తొలకినట్లుండె)

మెరయ శ్రీవేంకటేశు మేన సింగారముగాను - తరచయిన సొమ్ములు ధరియించగా
మెరుగుబోడి అలమేలుమంగయు తాను - మెరుపు మేఘము కూడి మెరసీనట్లుండె



శ్రీనివాసుని
అభిషేకపు సొగసులు

పల్లవి :

నమో నమో రఘుకులనాయక దివిజవంద్య - నమో నమో శంకరనగజా నుతా

చరణాలు :

విహితధర్మపాలక వీరదశరథరామ - గహనవాసినీ తాటకామర్దన
అహల్యా శాపవిమోచన అసురకులభంజన - సహజవిశ్వామిత్ర సవనరక్షకా

హరకోదండహర సీతాంగనావల్లభ - ఖరదూషణారి వాలిగర్వాపహా
తరణితనూజాది తరుచరపాలక - శరధిలంఘనకృత్య సౌమిత్రిసమేతా

బిరుద రావణశిరోభేదక విభీషణ - వరద సాకేతపురవాస రాఘవ
నిరుపమ శ్రీవేంకటనిలయ విజనగర - పురవరవిహార పుండరీకాక్షా



పార్వతీపరమేశ్వరుల ధ్యానసమాధిలో
నిలిచిన రామమంత్రము
సకల జీవరాశులకు "శ్రీరామరక్ష"

పల్లవి :

కొలువుడీ భక్తి కొండలకోనేటినిలయుని శ్రీనిధియైనవాని

చరణాలు :

ఆదిదేవుని అభవుని సామ - వేదనాదవినోదుని నెర
వాది జితప్రియు నిర్మలతత్త్వ - వాదులజీవనమైనవాని

దేవదేవుడైనదివ్యుని సర్వ - భావాతీతస్వభావుని
శ్రీవేంకటగిరిదేవుడైన పరదేవుని భూదేవతత్పరుని



భావాతీతుడైన పరాత్పరుడు
కొండల కోనేటి నిలయుడైనాడు.
భక్తులపాలిట కొంగబంగారంగ
నిలిచినాడు.

పల్లవి :

పరమపురుష నిరుపమాన శరణు శరణు రే
యే యే యే యే ఇందిరా నిజమందిరా

చరణాలు :

కమలనాభ కమలనయన కమలచరణు రె
అమితసురమునినాథయూథపనాయకా వరదాయకా

చతురమూరితి చతురబాహు శంఖచక్రధరా
అతిశయ శ్రీవేంకటాధిప అంజనాకృతిరంజనా



నిరుపమానమైన పరమపురుషుడు శ్రీనివాసుడు
అంజనాద్రి సానువులలో వెలసినాడు

పల్లవి :

దీనుడ నేను దేవుడవు నీవు - నీ నిజమహిమే నెరపుట గాక

చరణాలు :

మతి జనన మెరుగ మరణం బెరుగను - ఇతవుగ నినునిక నెరిగేనా
క్షితి పుట్టించిన శ్రీపతివి నీవే - తతినాపై దయ తలతువు గాక

తలచ పాపమని తలచ పుణ్యమని - తలపున ఇక నిను తలచేనా
అలరిన నాలో అంతర్యామివి - కలుష మెడయ నను కాతువు గాక

తడవ నా హేయము తడవ నా మలినము - తడయక నీ మేలు తడవేనా
విడువలేని శ్రీవేంకటవిభుడవు - కడదాకా నిక కాతువు గాక



**జీవుని దీనభావమే దేవుని**
**కరిగించి కరుణింపచేసేది.**

పల్లవి :

జోవచ్యుతానంద జోజో ముకుంద - రావె పరమానంద రావె గోవింద



చరణాలు :

నందు నింటను జేరి నయము మీరంగ - చంద్రవదనలు నీకు సేవ చేయంగ
అందముగ వారిండ్ల ఆడుచుండంగ - మందలకు దొంగ మా ముద్దురంగ

(పాలవారాశిలో పవళించినావు, బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు, బాలుడై యుండి గోపాలుడైనావు

అట్టుగట్టిన మీగడెట్ల తిన్నాడే, పట్టి కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినెనని యత్త యడుగవిన్నాఁడే, గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే

గొల్లవారిండ్లకును గొబ్బునను బోయి కొల్లలుగా త్రావీ కుండలను నేయి
చెల్లునా మగనాండ్ర జెలిగి యిటుశాయీ చిల్లరతనములు సేయ జెల్లునటవోయి

రేపల్లె సతులెల్ల గోపంబుతోను, గోపమ్మ మీ కొడుకు మా యిండ్లలోను
మాపుగానే వచ్చి మామానములను నీ పాపడే చెఱిచే నేమందుమమ్మ

ఒకని యాలినిదెచ్చి, నొకని కడబెట్టి, జగడములు గలిపించి సతిపతులబట్టి
పగలు నలుజాములును బాలుడైనట్టి మగనాం[డ జేవట్టి మదనుడైనట్టి)

అంగజుని గన్న మాయన్న యిటు రారా - బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా - ముంగిట నాడరా మోహనాకారా

(గోవర్ధనంబెల్ల గొడుగుగాబట్టి, కావరమ్మునసున్న కంసుcబడగొట్టి
నీవు మధురాపురము నేలcజేపట్టి, ఠీవితోనేలిన దేవకీపట్టి)

అంగుగా తాళ్ళపాకన్నయ్య చాల - శృంగారరచనగా చెప్పె నీజోల
సంగతిగ సకల సంపదల నీవేళ - మంగళము తిరుపట్ల మదనగోపాల



లోకాలనేలే లోకేశ్వరునే జోకొట్టి
జోలపాడుతున్నాడు సంకీర్తనాచార్యుడు
మన తెలుగుల పాలిటి 'యశోదమ్మ'

పల్లవి :

మరలి మరలి జయమంగళము - సొరిది నిచ్చలును శుభమంగళము

చరణాలు :

కమలారమణికి కమలాక్షునకును - మమతల జయజయ మంగళము
అమరజననికి అమరవంద్యునకు - సుముహూర్తముతో శుభమంగళము

జలధికన్యకును జలధిశాయికిని - మలయుచును శుభమంగళము
కలిమికాంతకా (కు+ఆ) కలికి విభునికిని - సుళువుల ఆరతి శుభమంగళము

చిత్తజుతల్లికి శ్రీ వేంకటపతికి - మత్తిల్లిన జయమంగళము
ఇత్తలనత్తల ఇరువురకౌగిట - జొత్తుల రతులకు శుభ మంగళము



అలమేలుమంగాశ్రీనివాసులకు
జయమంగళం, శుభమంగళం

పల్లవి :

బ్రహ్మ కడిగిన పాదము - బ్రహ్మము తానె నీ పాదము

చరణాలు :

చెలగి వసుధ కొలిచిన నీ పాదము - బలితల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము బలరిపు గాచిన పాదము

కామిని పాపము కడిగిన పాదము - పాముతలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము - పామిడి తురగపు పాదము

పరమయోగులకు పరిపరి విధముల - పరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన - పరమపదము నీ పాదము



పరబ్రహ్మతత్వాన్ని చాటే
శ్రీనివాసుని దివ్యపాదము

ఆదిపురుషా అఖిలాంతరంగా - భూదేవతారమణ భోగీంద్రశయనా

భవఘోరతిమిరదుర్భవకాలమార్తాండ - భవభద్రమాతంగపంచానన
భవకమలభవ మాధవరూప శేషాద్రి - భవన వేంకటనాథ భవరోగవైద్య

పల్లవి :
సర్వోపాయముల జగతి నా కితడే - వుర్వీధరుడు పురుషోత్తముడితడే

చరణాలు :
సకలగంగాదితీర్థస్నానఫలము లివి - స్వామిపుష్కరణిజలమే నాకు
సకలపుణ్యక్షేత్రా (త్ర ఆ) వాసయాత్ర లివి - సరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి - శౌరిసంకీర్తనం బిదియే నాకు
(సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చుటఁ జాతుపడి కైంకర్య మిదియే

ఉపవాసతపములివి యితనిప్రసాదంబులొగి భుజింపుటే నాకు దినదినంబు
జపరహస్యోపదేశంబు లితనిపాదజలంబులు శరణనేటిసేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషుల దర్శనము నాకు నొగి నిచటి బహువృక్ష దర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటియెన్నఁగలబహుపక్షికలకలంబు)

తలపుగలయోగంబులందు శ్రీవైష్ణవుల - తగులుసంవాస సహయోగంబు
(వెలయ నిండుమహోత్సవంబులిన్నియు నితనివిభవంబులెసఁగు తిరునాళ్లు నాకు)
అలరునాసంపదలు యితని పట్టపురాణి - అలమేలుమంగ కడకంటిచూపు
చెలగి యిటు దేవతాప్రార్థ నింతయు నాకు - శ్రీవేంకటేశ్వరుని శరణాగతి



**నాకు స్నానపానాలు, జపతపాలు, తీర్థాలు, క్షేత్రాలు, పూజలు, పునస్కారాలు అన్నీ వేంకటరమణుడే**

పల్లవి :

కల దింతె మాట కంతుని యాట - తెలుసుకో నీలో నిదియె పూట పూట

చరణాలు :

అలమేలుమంగా హరియంతరంగా - కలితనాట్యరంగ కరుణాపాంగా
చెలువుడు వీడె చేకొను నేడె - వలరాజు తూపులివి వాడి మీద వాడి

అలినీలవేణి అంబుజపాణి - వెలయంగ జగదేకవిభుని రాణి
కలయు నీపతి వచ్చె గక్కన నిన్నిదె మెచ్చె - పలికీని చిలుకలు పచ్చి మీద పచ్చి

సితచంద్రవదనా సింగారసదనా - చతురదాడిమబీజచయరదన
ఇతవైన శ్రీవేంకటేశుడు నిన్నిదెకూడె - తతి తలపోతలు తలకూడె కూడె



హరి అంతరంగాన నిలిచిన
కరుణాంతరంగ అలమేలుమంగ

పల్లవి :

కంటికంటి నిలువు చక్కని మేనుదండలును
నంటుచూపులను జూచే నగుమోముదేవుని

చరణాలు :

కనకపుపాదములు గజ్జెలు నందెలును - ఘనపీతాంబరముపై కట్టుకటారి
మొనసి యొడ్డాణపు మొగపుల మొలనూలు - ఒనర నాభికమల ముదరబంధములు

గరిమ వరదహస్త కటిహస్తములును - సరస నెత్తిన శంఖచక్రహస్తములు
ఉరముపై కౌస్తుభ మొప్పగు హారములు - తరుణి యలమేలుమంగ ధరణి భామయును*

కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు - కట్టాణిముత్యాలసింగారనామము
నెట్టన శ్రీవేంకటేశ నీకు కర్ణపత్రములు - నట్టె శిరసుమీద నమరేకిరీటము



ఆనందనిలయ విమానస్థుడైన
శ్రీనివాసుని తిరుమూర్తి వర్ణన
'పాదాత్ కేశాంతం'

*శేషాచార్య వ్రాతప్రతిలో ఈ వాక్యం లుప్తమయింది.
ఇది నా పూరణ.



'కలౌ సంకీర్త్యకేశవం'. క్రతువులు, యజ్ఞయాగాదులు, అర్చనపూజనాదులు కాదు, వేంకటేశ్వరుని నామం జపిస్తే చాలు. అదే మనకు ఇహం పరం.

నమో నారాయణాయ । నమస్సమధికానందాయ సర్వేశ్వరాయ

నమో నారాయణాయ । సమధికానందాయ సర్వేశ్వరాయ నమః

దేవతాధిపమకుట దివ్యరత్నాంశు సంభావితామల పాదపంకజాయ
కైవల్యకామినీకాంతాయ తే నమో శ్రీ వేంకటాచల శ్రీనివాసాయ తే నమః

పల్లవి :
ఇదియే సాధనమిహపరములకును - పదిలము మాపాలి పరమపునామము

చరణాలు :
కలిదోషహరము కైవల్యకరము - అలరిన మా శ్రీహరినామము
సులభము సౌఖ్యము శోభనతిలకము - పలుమారును శ్రీపతినామము

పాపనాశనము బంధవిమోక్షము - పైపైనిది భూపతినామము
స్థాపితధనమిది సర్వరక్షకము - దాపురమిది మాధవనామము

నేమము దీమము నిత్యకర్మమిది - దోమటి గోవిందునినామము
హేమము శరణము యిన్నిట మాకును - యేమేర శ్రీ వేంకటేశ్వరునామము

పల్లవి :

కన్ను లెదుటిదే ఘన వైకుంఠము - వెన్నుని కొలిచిన విజ్ఞానికిని

చరణాలు :

తలచినదెల్లా తత్వరహస్యమె - తెలిసిన యోగికి దినదినము
పలికినవెల్లా పరమమంత్రములె ఫలియించిన హరిభక్తునికి

పట్టినదెల్లా బ్రహ్మాత్మకమే - పుట్టుగు గెలిచిన పుణ్యునికి
మెట్టినవెల్లా మిన్నేటినిధులె - రట్టడి తెగువ మెరయువానికిని

వినినవియెల్లా వేదాంతములే ఘనుడగు శరణాగతునికి
యెనసిన శ్రీ వేంకటేశుడె యింతా - కొనకెక్కిన నిజకోవిదునికిని



**విష్ణుమూర్తిని తెలుసుకొన్న విజ్ఞానికి**
**కన్నులెదుటనే వైకుంఠం సాక్షాత్కరిస్తుంది**

పల్లవి :

నీ నామమే మాకు నిధియు నిధానము - నీ నామమె యాత్మనిధానాంజనము

చరణాలు :

నమో నమో కేశవ నమో నారాయణ - నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదన - నమో త్రివిక్రమ నమో వామనా

నమో నమో శ్రీధర నమో హృషీకేశ - నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ - నమో ప్రద్యుమ్న తే నమో యనిరుద్ధా

నమో పురుషోత్తమ నమో యధోక్షజ - నమో నారసింహ నమోస్తు యచ్యుత
నమో జనార్దన నమోస్తు ఉపేంద్ర - నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణా



**శ్రీనివాసుని నామమే**
**మనకు నిధి నిధానము**

పల్లవి :

రారా చిన్నన్నా రారోరి చిన్నవాడ - రార ముద్దులాడ రారోరి బాలకృష్ణ

చరణాలు :

కిందిచూపుల గిలిగించి ఆలమంద గొల్లెతల మరిగించి
సందడి వలపించి జవరాండ్ల వూర - వింద వైనయట్టి వేడుకకాడ

కొదలుమాటలనె గొణగుచు భూమి సుదతుల శిగ్గులు చూరాడి
చిదుగుచేతలనె చెనకుచు ముద్దుపెదవిచవులు చూపిన జాణకాడ

కలికితనముననె కరగించి కాచె చెలుల కాగిటనె చెలగి
లలనామణియైన లకిమమ్మ కలసుక శ్రీవెంకటనాథు డైనవాడ



ఆలమందల తిరుగుతూ అల్లరిచేస్తూ
పిచ్చిగీతాలను పాడిన చిన్నికృష్ణుడే
గీతాచార్యుడైన యోగేశ్వరేశ్వరుడు.
చిన్నికృష్ణుని గోముగా పిలుస్తున్నాడు.
అన్నమయ్య మనుమడు చినతిరుమలయ్య.



భావయామి గోపాలబాలం



తొల్లియును మఱ్ఱాకు

# యాదాళ్ళ పిచ్చయ్యశెట్టి చారిటీస్ అసోసియేషన్, కడప

**స్థాపితం** : 1920లో ఏకైక వైశ్య కుటుంబ నిధుల నుండి ఏర్పడినది.

**సంస్థాపకులు** : శ్రీ యాదాళ్ళ పిచ్చయ్యశెట్టి గారు

**ధ్యేయం** : నిరంతర అన్నదాన సేవ
ధర్మసత్ర నిర్వహణ
పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి సదుపాయాలు
మహిళాభ్యుదయ కార్యక్రమాలు
దేవాలయ పూజా పునస్కార విధులలో పాల్గొనడం
ప్రజాశ్రేయస్సుకు సంబంధించిన కార్యక్రమాలలో పాలుపంచుకోవడం

**దానధర్మాలు** :
1. వరసిద్ధి వినాయక దేవాలయం, కాణిపాకం. నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం
2. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాలయం, శ్రీశైలం. నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం
3. శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం, కసాపురం. నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం
4. కడప వరద బాధితుల సహాయార్థం ముప్పైవేల రూపాయల విరాళం
5. అన్నమయ్య విగ్రహ స్థాపనకు కడపలో లక్ష రూపాయల విరాళం (కడపోత్సవాల సందర్భంగా)
6. సునామీ వరద బాధితుల సహాయార్థం గౌ. ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయల విరాళం

త్రికరణ శుద్ధిగ చేసిన పనులకు దేవుడు మెచ్చు లోకమును మెచ్చును (అన్నమయ్య)

కామిశెట్టి శ్రీనివాసులు, మేనేజింగ్ ట్రస్టీ, 2-2-647/103/102, "సుదర్శన్",
సాయి రెసిడెన్సీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాద్ - 500 013. ఫోన్ : (040) 27426842